# జీవన రాగం X

రచన :
శ్రీ. చంద్రశేఖర్.

'చాలా బాగుందండీ' అన్నది నిర్మల తీసుకున్న పుస్తకాలు తిరిగి ఇచ్చివేస్తూ—

కొన్ని క్షణాల తరువాత ఆమె 'ఇంతవరకు మీరు నవలా కారులని నాకు తెలియనే తెలియదు' అన్నది దానికి ఆనంద్ ఏమీ జవాబు చెప్పలేదు.

'ఇంకా ఏమన్నా పుస్తకాలుంటే ఇస్తారా' నిర్మల అడిగింది.

'లేవండి' ముక్తసరిగా సమాధానం చెప్పాడు ఆనంద్.

'వస్తానండీ' అని సమాధానం చెప్పి బయటకు నడిచింది నిర్మల.

* * *

ఇరవై ఏళ్ళ వయస్సుగల నిర్మల యూనివర్సిటీలో రీసర్చి చేస్తోంది. వాళ్ళింట్లోనే అద్దెకుంటున్నాడు ఆనంద్ తన ముసలితల్లితో.

ఇలా మొదలయిన పరిచయం స్నేహంగా మారిందంటే ఒక్కోసారి నిర్మలకే ఆశ్చర్యం వేస్తూంటుంది. రోజుకో సారన్నా నిర్మలతో మాట్లాడందే ఆనంద్ ఉండలేడు.

ఆనంద్‌ను నిర్మల మనసారా ప్రేమించింది. అందుకనే అంత దగ్గరగా వచ్చింది. ఒకరోజు ఆనందే బైట పెట్టాడు, నిర్మల అంగీకారం తెల్పింది.

ఇంతలోనే వారం రోజులన్నా కాలేదు జరిగిపోయింది ఆనంద్ తల్లిమరణం. ఆనంద్ జీవితమీద అదో పెద్ద దెబ్బేనని చెప్పాలి. రెండు రోజుల వరకూ బయటనే కన్పడలేదు. మూడోరోజు రాత్రి ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. నిర్మలకు ఒక ఉత్తరం వ్రాసి...

నిర్మలముందు ఆ సంగతులన్నీ సినిమా రీలుగా తిరిగాయి. అవన్నీ నిన్నగాక మొన్న జరిగినట్లున్నై. తనలో తాను అనుకుంది. తను చూసింది నిజంగా ఆనంద్‌నేనా అని. తన కళ్ళను తానే నమ్మలేదా! ఆ వ్యక్తి ఆనందే!

నిర్మల కళ్ళు అనుకోకుండానే వర్షించాయి.

'అమ్మా కారు రెడీగా ఉంది' అన్నాడు డ్రైవరు రాజు లోపలికొస్తూ.

రాజు, నేను కాలేజీకి వెళ్ళలేను ఈ లీవ్ లెటర్ ఇచ్చిరా ఎటో చూస్తూ అంది నిర్మల.

'సరేనమ్మా' అంటూ నిష్క్రమించాడు రాజు. ఎంత మరచి పోదామనుకున్నా ఆనంద్ ప్రతిబింబం తన కళ్ళ ముందరే కదలుతున్నట్లుంది.

తను మనసారా ప్రేమించిన ఆనంద్ ఇంకొకరిని వివాహమాడటమా? తలగడలో తల ఉంచి కుమిలి పోయింది నిర్మల.

ఇంతలో నౌకర్ రాజయ్య 'అమ్మా ఎవరో బాబుగారు ఈ కవరిచ్చి పోయారమ్మా' అన్నాడు.

నిర్మల అత్రంగా విప్పి చదివింది.

నిర్మలా!

చాలా ఆశ్చర్యపడి ఉంటావనుకుంటాను. ఆనంద్ నాకెవరో తెలియదని నీవన్నపుడు-కాని నిర్మలా! నీకంటె వేయురెట్లు నేను నాలో కుమిలిపోయా! మా అమ్మ మరణం నన్ను మరీ కృంగదీసింది. ఆ క్షణంలో నాకు ఏవస్తువు చూచినా అమ్మే కన్పడేది. ఇక ఉండలేక మనఃశాంతి కోసం బయలు

దేరాను. నిర్మలా! ఎన్నో చోట్లు తిరిగాను. నా ఈ యాత్రలోనే నరసింహం కలశాడు. చాల కాలం క్రిందట ఇంటిని విడిచి వచ్చాడు. నిర్మలా! నరసింహంతో నా పరిచయం పెద్దయింది. నిర్మలా! ఇద్దరం ఎప్పుడూ కలసి తిరిగే వాళ్ళం. అకస్మాత్తుగా ఒకచోట పాము కరచి మరణించాడు. ఆక్షణంలో అతనికి అదెక్కడ కల్గిందో ... జ్ఞానం కల్గింది. అతని ఇంటి ఎడ్రసు ఇచ్చాడు.

నిర్మలా! అతని భార్యను అతడు చిన్నతనంనుంచి సరిగా ఒకసారైనా చూడనేలేదు. చివరి క్షణాలలో తన భార్యకన్యాయం చేశానన్న పశ్చాత్తాపం అతన్ని దహించివేసింది. గురువుగా, మిత్రుడుగా నన్ను ప్రార్థించాడు. నిర్మలా! ఆమెను సధవగానే ఉంచమని. ఆక్షణంలో అతని మరణవేదన చూడలేక అతనికి మాటిచ్చాను.

నిర్మలా! ఆపైన కాని అర్థంకాలేదు.

నీ ప్రభావం నాపైన ఎంత ఉందో - క్షణక్షణం ఏదో వక భయంకర పిశాచం నన్ను వెంటాడి పీడించుతున్నట్లుండేది.

సరళకూడా చాల ఉదారస్వభావం కలదే. ఈమూడేళ్ళలోనూ ఒక్కసారి గూడా ఆమెను భర్తగా తాకనైనా లేదు. నిర్మలా! త్యాగమన్న పేరుతో ఆత్మవంచన చేసుకొంటున్నానేమోనన్పించేది ప్రతిక్షణం. కాని మిత్రునికిచ్చిన వాగ్దానం నన్ను కట్టిపడేసింది.

మొన్న నీవు కనబడ్డప్పటినుంచీ నాలో అగ్ని పర్వతాలు ప్రేలుతున్నై. ఇక ఆభయంకర సత్యాన్ని నా గుండెల్లో దాచుకోలేక ఆ రాత్రే ఆమెకు చెప్పాను. ఆమె గుండెఆగి మరణించింది. నిర్మలా! ఈ ప్రపంచంలో ఎవరికిచ్చిన వాగ్దానమూ సరిగా నిర్వహించలేక పోయాను.

నిర్మలా! మీ అందరి మధ్యలో - నాలో నేను కుమిలిపోతూ ఉండలేను. ఈరోజే వెళ్ళిపోతున్నాను నిర్మలా! మీ అందరికీ దూరంగా ఆత్మశాంతి లభ్యమయ్యేచోటుకు.

—ఆనంద్,

నిర్మల ఉత్తరం చదవటం పూర్తి చేసేటప్పటికి ఆమె అచేతనంగా ఉండిపోయింది. కొన్నిక్షణా లామె మనస్సు తుఫానులో ఓడలాగా ఊగిసలాడింది.

'రాజు' బిగ్గరగా అరచింది నిర్మల.

దాదాపు బయటకు పరిగెడుతూ.

పని తప్పింది కదా అని కులాసాగా నౌకరుతో కబుర్లు చెపుతున్న రాజు ఉలిక్కిపడ్డాడు.

'వెంటనే కారు బయటకు తీయ్' దాదాపు అరచింది నిర్మల.

మరికొన్ని నిముషాలలో నిర్మల రైల్వే స్టేషనులో ఉంది.

రైలు బయలుదేరటానికి సిగ్నలిచ్చారు. హడావుడిగా ప్లాట్‌ఫారంమీద పరిగెత్తింది నిర్మల. నీరసంగా ఒక కంపార్టుమెంటులో కూర్చున్న ఆనంద్ కనబడ్డాడు నిర్మలకు.

ఆమె కళ్ళలో ఏదో నిశ్చయం తళుక్కున మెరసింది.

రైలు ఆమెను ఆశీర్వదించింది. ఉలిక్కిపడుతూ రైలెక్కింది నిర్మల.

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులుకాదు. —సంపాదకుడు.